# పనస పండు

## దేవత సుబ్బారావు

ఈ మధ్య ఓ పెద్దపనిమీద రాజమండ్రి వెళ్ళాల్సొచ్చింది. తిరుగు ప్రయాణంలో రాజమండ్రి ప్లాట్‌ఫారం మీద అడుగుపెట్టానో లేదో నా కళ్ళు అప్రయత్నంగా అక్కడ పళ్ళ దుకాణంలో ఉన్న పనస పండు మీద పడ్డాయి. దాంతో నా పాట్లు ప్రారంభం అయ్యాయనుకోండి. పనసపండంటే మా ఆవిడకి చాలా చాలా యిష్టం. దుకాణదారు ఖరీదు చెప్పగానే నసాళం అంటి కళ్ళు గిర్రున తిరిగాయి. తమాయించుకునే లోపులో ఒక మిత్రుడు అక్కడ తారసిల్లాడు "చాలాకాలానికి కనపడ్డావే" అంటూ, అతను నా మీది ప్రేమతో ఆ పండుని బేరం ఆడి కొని నాకు బహుమతిగా యిచ్చాడు అది నిజంగా ఏనుగు దానమంటే నమ్మండి. సరే చచ్చినట్టు ఒక కూలివాడి చేత దాన్ని మోయించుకుని రైలెక్కాను. నా మిత్రుడు ప్రక్కనవుండగా నేనుదాన్ని మోస్తే నా మోషీకదా? ఆయన ఏమనుకుంటాడో. అతను అక్కడలేకపోతే నా సూటుకేసుతోపాటు దాన్నికూడా మోసేవాణ్ణిసు మండీ. అతను చూస్తూండగానే దాన్ని నేను మోస్తే పరువు నష్టంకదా.

రైల్లో రాత్రిప్రయాణం చేస్తూన్నంత సేపూ నాదృష్టి ఆ పండుమీదే వుంది. కన్ను కునుకు పట్టిందంటే ఎవడయినా దాన్ని తాంబూలం వేసేస్తాడు. స్లీపరు బెర్తు కొనుక్కున్నా పనసపండును రక్షించుకోడానికి నిద్రమానుకున్నాను. చీకట్లో బాత్‌రూంకి వెళ్ళే వాళ్ళ కాళ్ళకి ఆపండు తగలడం, వాళ్ళుపైకి కాకపోయినామనసులో నాకూ ఆపండుకి శాపనార్థాలు పెట్టడం జరుగుతూండేది. ఎలాగైతే తెల్లారకుండానే సికింద్రాబాదు చేరుకుంది రైలు. ఇక ఫరవాలేదులే అనుకున్నాను. ఒక చేత్తో పండునీ, మరో చేత్తో సూటుకేసునీ ఎత్తుకున్నాను. చంటిపిల్లల్ని ఎత్తుకున్నట్టు. "రాజమండ్రిలో కూలీ అర్థరూపాయి లాగాడు. సికింద్రాబాదులో అయితే, తెలుగు వచ్చినా రానట్టుగా నటిస్తూ, ఉర్దూలో మాట్లాడుతూ, ఖచ్చితంగా రూపాయిఅడిగేస్తాడు" అని అనుకుంటూ రూపాయి ఆదా అయింది కదా అని నన్ను నేను అభినందించుకున్నాను. సరిగ్గా అదే సమయానికి ఎములాడి లాగా మరో స్నేహితుడు తారసిల్లాడు. ఇక చేసేదిలేక కుక్కిన పేనులాగ అయిపోయి, లోపలబాధగావున్నా పైకి దర్జాగా నటిస్తూ కూలీని కేకేసి పండును తీసుకు రమ్మన్నాను, బైటవున్న బస్సు స్టాండుకి. వాడు నిజంగానే రూపాయి

లాగేశాడు.

42 నెంబరు బస్సుకోసం వించు న్నాను. దానిమీద రాణీగంజి వెళ్ళి (పండుతోసహా) అక్కడ 125నెంబరు బస్సు ఎక్కి ఇంటికి రామచంద్రపురం చేరుకోవాలి. 125 నెంబరు బస్సు రాణీగంజికి ఠకీమని 6.20 నిముషాలకే వచ్చేస్తుంది. అరుగంటలు కావచ్చినా దిక్కుమాలిన42వనెం బరుబస్సురావడం లేదు. చేసేదిలేక రిక్షా మాట్లాడుకుని పదిలంగా ఎక్కాను పండతో సహా. రిక్షావాడు నిలేసి రూపాయి లాక్కున్నా ఫైంకి రాణీగంజికి చేర్చాడు. నన్నూ, దిక్కుమాలిన పనసపండునీ.నా కర్మం కాలి 125నెంబరుకి బదులు 127నెంబరు బస్సు వచ్చింది. అది మా B.H.E L. కాలనీ బైట గేటుదగ్గరే ఆగి పట్టన్ చెరువుపోతుంది, కాలనీ లోకి రాదు. పండుని తిట్టుకుంటూ బస్సు లోకి మోసుకొచ్చాను. రాత్రి నిద్రలేకపోవడం మూలాన చల్లగాలికి బస్సు కదలికలో నిద్ర వచ్చేసింది.డ్రైవరు బ్రేకు వేసినప్పు డల్లా ఆ దిక్కుమాలిన పండు దొర్లు కుంటూ పోతూ వుండేది. ఓసారి ఓ ముసలమ్మగారి కాలికి తగిలి దానిముళ్లు ఆవిడకాలికి గుచ్చుకున్నాయట. అదేదో జంతువని భయపడి, తన సొమ్మంతా పోయినట్టు ఆవిడ ఓ పెద్ద గావుకేక వేసింది భయంతో. దాంతో వులిక్కి పడిలేచాను. కండక్టరు ఉర్దూలో నన్ను దబాయిస్తున్నాడు. ఆ భాష నాకు ఛస్తే రాదు. పండుని గురించే అనుకుని నేను ఇంగ్లీషులో దబాయించాను, బ్రేకు వేయడం డ్రైవరు తప్పని. అక్కడ వున్న ఉర్దూ తెలిసినవాళ్ళు చెప్పిం దేమిటంటేకం డక్టరు నన్ను ఆ జంతువు ఏమిటని అడుగుతున్నాట్ట. వాడు అటు వంటి వస్తువుని ఎప్పుడూ చూడలేదట. నాలో నేను నవ్వుకుని పండుని దగ్గరగా లాగి పట్టుకున్నాను. మరోసారి బ్రేకు వేసినప్పుడు పండు దొర్లుకుంటూ పోయి గేరుకు అడ్డుపడి గేరుపడకుండా చేసింది. డ్రైవరు ఉర్దూలో ఏదో కోపంగా అన్నాడని నా అనుమానం. కండక్టరు నా బాధలు చూడలేక పండుని సీటుమీద నా ప్రక్కగా తెచ్చి పెట్టాడు.

ఎలాగో కష్టపడి B H.E.L కాలనీ దగ్గరకు చేరుకున్నాను. పండుతోసహా దిగాను. కండక్టరు టిక్కెట్టు యివ్వ కుండానే పండుకి అర్ధరూపాయి లగేజీ ఛార్జీ వసూలు చేశాడు. ఇక నా కష్టాలు గట్టెక్కాయి అనుకున్నాను. ఖర్మ కాదండీ, అంతా మనం అనుకున్నట్టు జరుగుతుందా. ఛస్తే జరగదు. పావలా పారేసి కూలీ పిల్లవాడిచేత దాన్ని యింటికి మోయించుకుపోదాం అను కుంటే ఒక్కడూ కనిపించలేదు. ఇక చేసేదిలేక బలవంతపు బ్రాహ్మణా ర్థంలా 1.50 పైసాలకు రిక్షా మాటాడు కుని యింటికి చేరుకున్నాను నేనూ, ఆ దిక్కుమాలిన పండూనూ.

పండుని మోసుకొచ్చి యింట్లో అడుగుపెట్టానో లేదో, మా ఆవిడ ఆ పండుకి సంతోషించలేదు సరికదా, అయ్యో అని కీకవేసి "కాశీమంచి గాడిద గుడ్డుని తెచ్చినట్టుగాయీపండుమ

మోసుకొచ్చి దాని జిగురంతా మీ లాల్చీకి పట్టించుకున్నారు. ఇక ఆ నల్లటి మరకలు ఎంత వుతికినా పోవు, ఆ లాల్చీ పనికిరాదు" అని నొచ్చుకుంది. నిజమే, అంతవరకూ ఆ మరకల్ని నేను గమనించలేదు. పదిహేనురూపాయలుఖరీదు చేసే ఆ లాల్చీ పాడయిపోయిందని నాకూ బాధ కలిగింది. స్నానం అయినాక కుర్చీలో కూచుని పేపరు చదువుకుంటూండగా, మా ఆవిడ వచ్చింది. దూకుడుగా, ఏదో అఘాయిత్యం జరిగిపోయిందని భయపడ్డాను. "యీ ఓక్కుమాలిన పండుని ఎందుకండి తెచ్చారు అంత దూరంనుంచీ, కోసి చూస్తే లోపల అంతా ఖరాబు, ఒక్క తొన కూడా పనికిరాదు" అంది. ఈ ఆడవాళ్ళకు కృతజ్ఞత ఉండదు సుమండీ. "ఇది చాలా మంచి పండని చెప్పాడే దుకాణం వాడు" అన్నాను. "వాడికే, తిపు దిగతీసింది. అలా చెప్పకపోతే ఏ చవట కొంటాడు యిలాంటి వాటిని" అని చవటల లిస్టులో నాపేరు మొట్టమొదటివాడగా చేర్చేసింది. "దాన్ని బయట పారేయకు. పండులోనిగింజలూ పై తొక్కాలూ తీసి పులుసులో పారేయ్. దాంతో పండు తిన్నంత కాకపోయినా కొంచెమైనా తృప్తి కలగుతుంది" అన్నాను. ఇక చస్తే పనసపండుని యింటికి తేకూడదని ఒక నిర్ణయం చేసేసుకున్నాను.

★

# అతనికి తెలుసు!

సాగుతుంది జీవితం సముద్రపు టలలా
కష్టాలు, సుఖాలు అలలుగా పొంగి పొరలుతున్నాయి
కష్టాలు ముందా సుఖాలు ముందా అని అలలుగా
పోటీ పడి నడుస్తున్నది అతని జీవితం.
కోరుకున్నాడు ప్రేమను పది కాలాలు పదిలంగా సాగాలి అని
దొరికింది అతని ఎడారి బ్రతుకుకు ఒక ఆశా జ్యోతి
ఆ జ్యోతినే పదికాలాలు వెలిగించాలి అని కోరుకున్నాడు
చమురు వున్నంత వరకే వెలుగు విస్తాను అన్నది ఆ జ్యోతి
పాపం! శాంతి హీనుడుకేం తెలుసు గాలి వస్తే ఆ జ్యోతి ఆరిపోతుందని

గోనుగుంట్ల ప్రభాకరరావు